సాక్షి ఒడిశా

శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



ఎలుగు కాదు.. అడవి పిల్లి

జయపురం: జయపురం రెండో దైనిక బజారు సమీపంలో అటవీ సిబ్బంది అడవి పిల్లిని పట్టుకున్నట్లు అటవీ విభాగ రేంజర్ సచ్చిదానంద పారిడ గురువారం వెల్లడించారు. బజారు సమీపంలో గల ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మ్ ప్రాంతంలో సంచరిస్తున్న జంతువును గుర్తించిన ఆ ప్రాంత ప్రజలు వెంటనే తమకు తెలియజేశారన్నారు. అటవీ సిబ్బందితో ఆ ప్రాంతానికి చేరుకున్నామని వెల్లడించారు. ఒక చోట దాగి ఉన్న అడవి పిల్లిని వల వేసి పట్టుకున్నామన్నారు. అడవి పిల్లికి వైద్య పరీక్షలు జరిపించి సురక్షిత అటవీ ప్రాంతంలో విడిచి పెట్టనున్నట్లు వెల్లడించారు. కొన్ని రోజుల కిందట జయపురం పినాంకి వనంలో ఎలుగుబంటి సంచరిస్తుందని ఆ ప్రాంత ప్రజలు తెలిజేశారన్నారు. సిబ్బంది గాలించగా ఆ ప్రాంతంలో ఎలుగు బంటి లేదని నిర్ధారణ అయిందన్నారు. సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలించగా ఆ ప్రాంతంలో సంచరిస్తున్నది ఎలుగుబంటి కాదని, అడవి పిల్లి అని తెలిపారు.

న్యూస్‌రీల్

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



చెట్టుకు వేలాడుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి పోలీసుస్టేషన్ పరిధి గోవిందపల్లి పంచాయతీ నూవగూడ గ్రామం అడవి మార్గంలో చెట్టుకు వేలాడుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. దీంతో స్థానికులు వెంటనే మత్తిలి పోలీసులకు సమాచారం అందజేశారు. మత్తిలి ఐఐసీ దేవదత్తు మల్లిక్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. అలాగే మల్కన్‌గిరి ఎస్‌డీపీవో సచిన్‌పటేల్ కూడా వెళ్లి మృతదేహంపై విచారణ చేపట్టారు. అయితే అక్కడ ఎవరికీ తెలియదని చెప్పడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

43 కేజీల గంజాయి పట్టివేత



నిందితులను చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి చలాన్‌గూడ గ్రామం వద్ద 43 కేజీల గంజాయిని ఎక్సైజ్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఛత్తీష్‌గఢ్ రాష్ట్రం బస్తర్ జిల్లాకు చెందిన తనీష్ బాగెల్, దినేష్ కశ్యప్, నాగేశ్ యాదవ్, పుష్పరాజ్ బట్టిలు మల్కన్‌గిరి ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేశారు. అనంతరం తిరిగి బస్తర్ వెళ్తున్న సమయంలో రెండు ద్విచక్ర వాహనాలు అతివేగంగా వెళ్లడం గమనించి చలాన్‌గూడ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎక్సైజ్ పోలీసులు ఆపారు. అనంతరం బైక్‌లపై ఉన్నటువంటి బస్తాలను తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. దీంతో వెంటనే వారిని అరెస్టు చేశారు. అలాగే వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, ఆధార్‌కార్డులు స్వాధీనం చేసుకున్నారు. 43 కేజీల గంజాయి విలువ బహిరంగ మార్కెట్లో రూ.4.40 లక్షలు మల్కన్‌గిరి ఎక్సైజ్ ఎస్‌ఐ ఆశిష్ కుమార్ బోయి తెలిపారు.

చోరీ కేసులో దొంగలు అరెస్టు



అరెస్టైన దొంగలు, రికవరీ చేసిన సొత్తు చూపిస్తున్న పోలీసులు

కొరాపుట్: ఒక చోరీ కేసుకు సంబంధించి దొంగలను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర పోలీసుస్టేషన్ ఐఐసీ సంబిత్ కుమార్ బెహర ఈ కేసు వివరాలు వెల్లడించారు. ఈనెల 22వ తేదీన రంగమట్టిగుడ గ్రామానికి చెందిన కైలాస్ కుమార్ చౌదరి ఇంట్లో దొంగలు పడ్డారు. ఇంట్లో బీరువాలు పగలుగొట్టి 15 గ్రాముల బంగారు, 40 గ్రాముల వెండి వస్తువులు, రూ.40 వేల నగదు దోచుకెళ్లారు. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో దసరాపాద ప్రాంతానికి చెందిన అంజు హరిజన్, ధనుర్జయ హరిజన్‌లు దొంగతనం చేసినట్లు గుర్తించి అరెస్టు చేశారు. వారి నుంచి చోరీ సొత్తు రికవరీ చేశారు. కేసును ఎస్‌ఐ కులభూషణ్ నాయక్ దర్యాప్తు చేస్తున్నారు.

జిమిడిపేటను సమితిగా గుర్తించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాయగడ: సదరు సమితి పరిధిలోని జిమిడిపేట పంచాయతీని సమితిగా గుర్తించాలని ఆ ప్రాంత ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఫరూల్ పట్వారీకి వినతి పత్రం గురువారం అందజేశారు. జిమిడిపేటకు సమీపంలోని కెరడ, హటోశశిఖాల్, గజ్జిగ, ఇరుకుబడి, బైరాగి హలువ వంటి పంచాయతీలతో కూడిన సమితిగా జిమిడిపేటను గుర్తించగలిగితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఆరు పంచాయతీల్లో సుమారు 50 వేలకు పైగా కుటుంబాలు నివసిస్తున్న నేపథ్యంలో వారి ఆర్థిక, సామాజిక రంగాలు కూడా ఎంతో మెరుగుపడే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మితా పువల తదితరులు పాల్గొన్నారు.



గుప్తేశ్వర పుణ్య క్షేత్రంలో వెలసి ఉన్న మహా శివుని లింగం



హరా..కనరా

- సమస్యల వలయంలో గుప్తేశ్వర్ పుణ్యక్షేత్రం

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి గుప్తేశ్వర్ పుణ్యక్షేత్రం సమస్యల వలయంలో కొట్టుమిట్లాడుతోంది. మహాశివరాత్రి కేవలం 6 దినాలే ఉన్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆ ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు గుప్తేశ్వరలో మహాశివరాత్రి ఉత్సవాలకు సన్నాహాలు చేస్తున్నారు. అయితే సమస్యలను విస్మరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. బొయిపరిగుడ నుంచి గుప్తేశ్వర్ వరకు గల 35 కిలోమీటర్ల పొడుగునా రోడ్డు ఇరుపక్కల వేలాది చెట్లు ఉన్నాయి. వాటిలో అత్యధికం పడిపోయే స్థితిలో ఉన్నాయి. ఎండి పడిపోయే స్థితిలో ఉన్న చెట్లు తొలగించకపోతే భక్తులకు ఇబ్బందులు తప్పవని అంటున్నారు. ఇదే మార్గంలో డొకిరీ,డొకరా ఘాట్‌లు ప్రమాదాలకు అడ్డాలుగా మారాయి. ఆ ప్రాంతాల్లో భక్తుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. శబరీ నది ఘాట్ రోడ్డు అతి శోచనీయంగా ఉందని, అలాగే గుప్తేశ్వర్‌లో చెత్త కుప్పలు దుర్గంధాన్ని వెదజలుతున్నాయని వాటిని తొలగించి పారిశుద్ధ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. గుప్తేశ్వర్‌లో టెలిఫోన్ నెట్‌వర్క్ పాడైపోయిందని 6 నెలల కిందట నెట్‌వర్క్ టవర్ బ్యాటరీ కాలిపోవటంతో నెట్‌వర్క్ పనిచేయటం లేదని అందువలన ఇతర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు ఇబ్బంది పడుతున్నారని, నెట్‌వర్క్ పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు. గుప్తేశ్వర్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, శిటిగుడలో ఉన్న ఒక బోర్‌వెల్ నుంచి తాగునీరు సరఫరా చేస్తున్నారని, ఒక వేళ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడితే తాగునీటి సరఫరా నిలిచిపోతుందని స్థానికులు చెబుతున్నారు. భక్తులకు రక్షిత తాగునీటి వనరులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే విద్యుత్ సౌకర్యానికి అంతరాయం ఏర్పడకుండా తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. మహాశివరాత్రి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు కేవలం 25 శౌచాలయాలు మాత్రం ఏర్పాటు చేస్తున్నారని, అవి భక్త జనాలకు సరిపోవని అందువల్ల మరికొన్ని మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు సూచిస్తున్నారు. గుప్తేశ్వర్‌లో 40 దుకాణాలు ఉన్నాయి. మరో 80 స్టాల్సు నిర్మాణంలో ఉన్నాయి. వాటిని వెంటనే పూర్తి చేయక పోతే భక్తులకు పూజా సామగ్రి, ఆహార దినుసులు అమ్మే వ్యాపారులు ఇబ్బందులు పడతారని అందువలన భక్తులకు అవసరమైన వస్తువులు లభించవని, అందుచేత వ్యాపారులకు అవసరమైన స్టాల్సు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. శబరీ నదిపై తాత్కాలిక వంతెన భక్తులు నది దాటేందుకు ఉందని, ముఖ్యంగా చత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వచ్చే వేలాది మంది భక్తులు తాత్కాలిక వంతెనే ఆధారమని, ఇకనైనా పర్మినెంట్ వంతెన చేయాలని సూచించారు. భక్తలకు అవసరమైన వైద్య సేవలు అందించేందుకు తగినన్ని వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, అలాగే భక్తుల కోసం జయపురం నుంచి తగినన్ని బస్సులు వేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



గుప్తేశ్వర్‌లో రహదారి పరిస్థితి

‘పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించండి’



జయపురం ఏబీఈఓకి వినతిపత్రం సమర్పిస్తున్న కళ, క్రీడా శిక్షక సంఘ సభ్యులు

జయపురం: కళలు, క్రీడలు నేర్పే శిక్షకులను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని ఒడిశా కళా, క్రీడా శిక్షక సంఘం జయపురం సబ్‌డివిజన్ శాఖ డిమాండ్ చేసింది. గురువారం కళా, క్రీడా శిక్షక సంఘం జయపురం నేతృత్వంలో పలువురు శిక్షకులు జయపురం బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారిని ఘెరావ్ చేశారు. ఈ సందర్భంగా వారు బీఈఓకు వినతి పత్రాన్ని అందజేయడానికి వెళ్లి ఆయన లేకపోవడంతో అదనపు బీఈఓకు అందజేశారు. 2013లో వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న కళ, క్రీడా ఉపాధ్యాయుల నియుక్తికి ప్రభుత్వం ప్రకటన జారీ చేసిందని, అప్పట్లో అభ్యర్థులు పరీక్షలు రాశారని, అందులో ఉత్తీర్ణులైన వారిని తాత్కాలిక టీచర్లుగా నియమించారని గుర్తు చేశారు. తమను పర్మినెంట్ ఉద్యోగులుగా పరిగణించాలని కోరారు. పన్నెండేళ్లుగా ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఎవరూ పట్టించుకోలేదని, నిర్ణయం తీసుకోకపోతే ఆందోళన బాట పడతామన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఉపాధ్యాయులు పద్మినీ బెహర, సురేష్ కుమార్ నాయిక్,రాజేంద్ర కుమార్ పట్నాయిక్,స్మిత రథ్,బబుల సాహు,మృత్యుంజయ భొయ్, జ్యోతిర్మయి మిశ్రా, శిశిర కుమార్ డాకువ, మణికుమార్ మహాపాత్రో, సుజాత బారిక్, సపన నాయిక్, పద్మ చరణ చౌధురి, నర్సింగ ప్రసాద్ షాడంగి తదితరులు పాల్గొన్నారు.

మార్చి 15లోగా పనులు పూర్తి



రైల్వేస్టేషన్‌లో అధికారుల పరిశీలన



పర్లాకిమిడి రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం మనోజ్ కుమార్ సాహు

పర్లాకిమిడి: స్థానిక రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మార్చి 15వ తేదీలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఈస్టు కోస్టు వాల్తేరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం మనోజ్ కుమార్ సాహు అన్నారు. పనులను పరిశీలించేందుకు గురువారం ఆయన పర్లాకిమిడి విచ్చేశారు. భారత్ అమృత్ స్టేషన్ల నవీకరణలో భాగంగా పర్లాకిమిడి రైల్వేస్టేషన్‌లో సుమారు రూ.20 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. దీంతో స్టేషన్‌లో ఓవర్ బ్రిడ్జి, రైల్వే కేటరింగ్ సర్వీసెస్, టాయిలెట్స్, కింగ గ్రామ రోడ్డు వద్ద లైటింగ్, ప్లాట్ ఫారం పనులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఆర్‌ఎం మనోజ్ కుమార్ రైల్వే ఇంజినీర్లుతో మాట్లాడి తిరిగి విశాఖపట్నం బయల్దేరారు. ఆయనతో పాటు సీనియర్ డివిజనల్ మేనేజర్(విశాఖపట్నం) అరుణ్ కుమార్ మహారాణా తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



ప్రమాదంలో గాయపడిన పూర్ణ

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ పోలీసు స్టేషన్ కెరాపుట్ గ్రామ సమీప రోడ్డులో పార్క్ చేసి ఉన్న ఒక నీలగిరి కలప ట్రక్కును వెనుక నుంచి ఒక బైక్ ఢీకొనటంతో ఇద్దరు వ్యక్తులు మరణించగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో మరణించిన వ్యక్తులు బొదాగుడ గ్రామానికి చెందిన లక్ష్మణ పారజ, కుమ పోరజ అని పోలీసు అధికారి సూరత్ ప్రధాన్ తెలిపారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తి బొదాగాం వాసి పూర్ణ అని, వెంటనే అతడిని బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు. పోస్టు మార్టం జరిపిన తరువాత వారి కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పజెప్పారు. బొరిగుమ్మ పోలీసు అధికారి సూరత్ ప్రధాన్ **తెలిపిన వివరాల ప్రకారం..**

బుధవారం బొదాగుడ ప్రాంత నుంచి లక్ష్మణ పోరజ, కుసు పారజ, పూర్ణ పారజలు ఒక బైక్‌పై బిజసింగపూర్‌లో ఒక వివాహ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు. వారు రాత్రి తిరిగి తమ గ్రామానికి వస్తుండగా కెరాపుట్ గ్రామ సమీపంలో నీలగిరి కలప రవాణా చేస్తున్న ఒక ట్రక్కు నిలిపి ఉంది. ఆ విషయం తెలియని బైక్ నడుపుతున్న వ్యక్తి నేరుగా ట్రక్కు వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సంఘటనా స్థలం వద్దే లక్ష్మణ, కుములు మరణించారని పోలీసు అధికారి వెల్లడించారు. మరో వ్యక్తి పూర్ణ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పూర్ణను బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. రెండు వాహనాలను సీజ్ చేశారు.

రిటర్నింగ్ అధికారుల నియామకం



రఘురాం పొడాల్



సచింద్ర స్వయ్

కొరాపుట్: విపక్ష బిజూ జనతాదళ్ పార్టీ సంస్థాగత ఎన్నికలకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా గురువారం ఆ పార్టీ రాష్ట్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారి హోదాలో ఉన్న ప్రతాప్ కేసరి దేవ్ పార్టీ రిటర్నింగ్ అధికారుల నియామకాలు చేపట్టారు. కొరాపుట్ జిల్లాకు కొరాపుట్ మాజీ ఎమ్మెల్యే రఘురాం పొడల్, నబరంగ్‌పూర్ జిల్లాకు సీనియర్ న్యాయవాది సచింద్ర స్వయ్‌ని నియమించారు. వీరిద్దరు ఇరు జిల్లాల్లో పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ చేపట్టనున్నారు.

స్వగ్రామానికి వలస కార్మికుని మృతదేహం



అంబులెన్స్‌లో గ్రామం చేరిన వినోద్ పార్థివ దేహం

జయపురం: పూనే-ట్రోన్ రైల్వే స్టేషన్‌ల మధ్య ఈ నెల 16న రైలు నుంచి జారి కిందపడి మరణించిన వలస కార్మికుని మృతదేహం బుధవారం అతని స్వగ్రామం బొయిపరిగుడ సమితి బొదాపుట్ గ్రామ పంచాయతీ కురకుటి గ్రామం చేరింది. కురుకుటి గ్రామ వాసి బినోద్ ఖొడ (43)ఎంతో కాలంగా మహారాష్ట్రలోని లునావాలా గ్రామంలో ఒక ఒక కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు. కొన్ని రోజుల కిందట స్వగ్రామం వచ్చాడు. తిరిగి మహారాష్ట్ర వెళ్లేందుకు విశాఖపట్నంలో మహారాష్ట్ర లునావాల్‌కు రైలులో బయల్దేరాడు. ఈ నెల 16 వ తేదీ మధ్యాహ్నం 2 గంటల సమయంలోపూనే-ట్రోన్ రైలు మార్గంలో రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. ట్రోన్ రైల్వే స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుని వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతదేహాన్ని గ్రామానికి రప్పించే విషయలో వారు బొయిపరిగుడ పోలీసులను సహాయం కోరారు. అనంతరం వారు కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చను ఆశ్రయించారు. మచ్చ వెంటనే ముంబాయి పోలీసులకు ఫోన్ చేసి మృతదేహాన్ని రప్పించే ఏర్పాట్లు చేశారు.

తీగ లాగితే..



పత్రికా ప్రతినిధుల సమావేశంలో ఎస్పీ రోహిత్ వర్మ తదితరులు

జయపురం: జయపురం హటపోదర్‌లో ఒక ట్రాక్టర్ షోరూంలో జరిగిన దొంగతనం కేసులో నిందితులను కదిలిస్తే.. దొంగతనాల చిట్టా బయటపడింది. కొరాపుట్ ఎస్పీ రోహిత్ వర్మ గురువారం జయపురం సబ్‌డివిజనల్ పోలీసు అధికారి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రం 7.30 గంటల సమయంలో జయపురం హటపాదర్ ప్రాంతంలో గెంబలి సోమేశ్వర రావు కుమారుడు గెంబలి వసంతరావు కోణార్క్ ఎంటర్‌ప్రైజర్స్ యజమాని పట్టణ పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదులో.. 17వ తేదీ తెల్లవారు జాము 2.30 గంటలు-3 గంటల మధ్య కాలంలో గుర్తు తెలియని వ్యక్తులు తన జాన్ డియర్ ట్రాక్టర్ల షోరూంలో ఐరన్ సేఫ్టీ లాకర్‌ను దొంగిలించారని, ఆ లాకర్‌లో రూ.2 లక్షల 50 వేల నగదు తో పాటు విలువైన లేండ్ డాక్యుమెంట్స్ ఉన్నాయని పేర్కొన్నారు. ఆ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దుండగులు షోరూం టాప్ పై ఉన్న రూఫ్‌ను తొలగించి పై నుంచి తాళ్లతో ఐరన్ సేఫ్టీ లాకర్ ను బయటకు తీసి దొంగిలించారని నిర్ధారించారు. ఎస్‌ఐ ఎస్‌కే బెహరా తన పోలీసు సిబ్బందితో దర్యాప్తు జరుపుతూ దొంగల క్లూ తెలుసుకున్నారని, పోలీసులు రింకు బెనియ అనే వ్యక్తి ఇంటిపై రైడ్ చేసి దొంగను అదుపులోనికి తీసుకున్నారని ఎస్పీ తెలిపారు. పోలీసు స్టేషన్‌లో అతడిని విచారించగా దొంగతనం చేసినట్లు అంగీకరించాడని, ఆ దొంగతనంలో మరో ముగ్గురు ఉన్నారని వెల్లడించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. నిందితుడు రింకు బెనియ మరికొన్ని దొంగతనాలు వివరాలు కూడా వెల్లడించాడు. హటపోదర్‌లో గల స్టోన్ వరల్డ్ మార్బుల్ షోరూంలో ఒక ప్రింటర్‌తో పాటు క్యాష్ కౌంటింగ్ యంత్రాన్ని, మొబైల్ ఫోన్లు దొంగిలించాడు. అలాగే జయపురం ఎన్‌కేటీ రోడ్డులో సారవతీ ఏజెన్సీస్ కొకాకొలా షోరూంలో రెండు పెద్ద సంచులలో డైరీ మిల్క్ చాకెట్లు దొంగిలించాడు. వీటి విలువ రూ.92,261లు ఉంటుంది. అలాగే హటపాదర్‌లో ఒక కాజు ఫ్యాక్టరీలో రూ.10 వేల నగదు దొంగిలించినట్లు వెల్లడించారని ఎస్పీ తెలిపారు. జయపురం బైపాస్ రోడ్డులో ఒక గ్రాసరీ షాపులో ఒక మిక్సర్ బేగ్, ఒక హోమ్ థియేటర్‌లను దొంగిలించినట్లు వెల్లడించాడని తెలిపారు. అలాగే బరిణిపుట్ గ్రామంలో యమహా షోరూంలో 31 స్మార్ట్ వాచ్‌లు దొంగిలించాడు. నిందితుడు ఇచ్చిన వివరణ ఆధారంగా పోలీసులు అగ్నిమాపక సిబ్బందిని రప్పించి గాంధీ చౌక్ సమీప కెనాల్‌లో వెతికించగా 6 గంటలు గాలించిన తర్వాత ఐరన్ సేఫ్టీ లాకర్ బయటపడింది. తర్వాత మరో నిందితుడు కను ముదులి ఇంటిపై పోలీసులు దాడి జరిపినట్లు ఎస్పీ తెలిపారు. నిందితులు దొంగిలించిన సామానులు పారాబెడ లో ఎల్‌ఎన్ స్టోర్స్ యజమాని జి.సూర్యనారాయణ పాత్రోకు అమ్ముతున్నట్లు తెలిసిందన్నారు. ఆ సామాన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ దొంగతనాల్లో నిందితులు బిజయ బెనియ ఉరఫ్ రింకు బెనియ(23)కను ముదులి (19)జి.సత్యనారాయణ పాత్రో(26) లపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. పత్రికా ప్రతినిధు సమావేశంలో ఎస్.పివర్మ తో పాటు జయపురం సబ్‌డివిజన్ పోలీసు అధికారి అంకిత కుమార్ వర్మ, జయపురం పట్టణ పోలీసు ఇన్‌చార్జ్ ,సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి పాల్గొన్నారు.



కెనాల్‌లో దొంగలు పడవేసిన ఐరన్ సేఫ్టీ లాకర్‌ను బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది



దుండగులు దొంగిలించిన ఐరన్ సేఫ్టీ లాకర్ బాక్స్

క్లుప్తంగా

పర్లాకిమిడిలో చిరుజల్లులు

పర్లాకిమిడి: గురువారం సాయంత్రం పట్టణంలో కొంతసేపు చిరుజల్లులు కురిశాయి. రాష్ట్రంలో రాజధానితో పాటు జగత్సింగ్‌పూర్, భద్రక్, కొరాపుట్, రాయగడ, గంజాం జిల్లాలో ఆరెంజ్ వార్నింగ్, గజపతి జిల్లాలో ఎల్లో వార్నింగ్‌ను ఐఎండీ జారీ చేసింది. నాలుగు రోజుల పాటు గజపతి జిల్లాలో చిరుజల్లులు లేదా అక్కడక్కడ వడగళ్ల వాన కురవనున్నట్లు వాతావరణ శాఖ నిపుణులు ప్రకటించారు.

రిమ్స్ సమస్యలపై కలెక్టర్ ఆరా

సాక్షి ఎఫెక్ట్...

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్య కళాశాల సమస్యలపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పందించారు. 'రిమ్స్ విద్యార్థుల ఆకలి కేకలు, రిమ్స్ హాస్టల్లో కాలకృత్యాలుకూ కష్టమే' శీర్షికలతో సాక్షిలో ప్రచురితమైన కథనాలకు ఆయన స్పందించారు. తొలుత విద్యార్థి నాయకులను పిలిపించి మాట్లాడారు. హాస్టల్‌లో మెస్ విద్యార్థుల ఆధ్వర్యంలో నడుస్తోందని, వారు సరైన ఆహారం సరఫరా చేయని పక్షంలో వారిని మార్చే వెసులుబాటు ఉందన్నారు. విద్యార్థులంతా సమావేశమై ఈ విషయంలో ఒక నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. అనంతరం ప్రిన్సిపాల్, వార్డెన్లతో మాట్లాడి సరైన ఆహారం సరఫరా అయ్యేలా చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. ఏపీఎంహెచ్ఐడీసీ అధికారులను పిలిపించి మరుగుదొడ్ల సమస్య లేకుండా చూడాలన్నారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని, తాగునీరు సమస్య పరిష్కరించాలని సూచించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

టెక్కలి: కోటబొమ్మాళి మండలం జాతీయ రహదారిలో పెద్దబమ్మిడి సమీపంలో ఈ నెల 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుబ్బారావుపేట గ్రామానికి చెందిన బాన్న ప్రత్యూష(29) గురువారం మృతి చెందింది. తన భర్త నడుపుతున్న ఆటోలో ప్రయాణిస్తూ కారును ఢీకొనడంతో ప్రత్యూష తీవ్రంగా గాయపడింది. భార్యభర్తలు ఇరువురు డాన్సు మాస్టర్లుగా పని చేసేవారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.ఎస్ఐ వి.సత్యన్నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆ మృతదేహం నగర వాసిదే



శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని హయాతినగరం సమీప నాగావళి నదీ తీరంలో బుధవారం కలకలం రేపిన మృతదేహం వివరాలను పోలీసులు గుర్తించారు. మీడియాలో కథనాలు చూసి కుటుంబ సభ్యులే గుర్తుపట్టి ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని తోటపాలెం జంక్షన్ సమీప నీలమ్మకాలనీకి చెందిన దండు త్రినాథరావు (45) మద్యానికి బానిసయ్యాడు. ఎప్పటికప్పుడు ఇంటి నుంచి బయటకెళ్లి కొన్నాళ్ల తర్వాత తిరిగొచ్చేవాడు. ఈ క్రమంలో ఈ నెల 14న ఇంటి నుంచి వెళ్లిపోయాడని, ఇలా జరుగుతుందని అనుకోలేదని భార్య వెంకటలక్ష్మి వాపోయారు. త్రినాథరావు పీఎస్ఎన్ఎం స్కూల్ సమీప దుకాణంలో కమ్మరి పనిచేస్తుండేవాడు. భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా వినాయకం బాధ్యతల స్వీకరణ


వినాయకం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా కుడిమి వినాయకం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన గతంలో పల్నాడు జిల్లాలో రెవెన్యూ డివిజనల్ అధికారిగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ అందజేసేలా కృషి చేస్తానన్నారు.

నిందితుడి అరెస్ట్

- తక్కువ ధరకే బొలెరో ఇప్పిస్తానని చెప్పి మోసం..

కొరాపుట్: బొలెరో తక్కువ ధరకే ఇప్పిస్తానని చెప్పి మోసం చేసిన వ్యక్తిని కొరాపుట్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం కొరాపుట్ ఎస్ఐ కృష్ణకుమారి ప్రదాన్ ఈ కేసు వివరాలు ప్రకటించారు. గతేడాది డిసెంబర్ 27వ తేదీన కొరాపుట్ సదర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొలాబ్‌నగర్‌కు చెందిన ఎస్.జయసేన్ ఈ మేరకు ఫిర్యాదు చేశారు. కటక్ చెందిన ప్రదోష్ పాత్ర తనకు తక్కువ ధరకే బొలెరో వాహనం విక్రయిస్తానని మోసం చేశారు. తమ సంస్థ వివిధ వేలం పాటలలో పాల్గొని తక్కువ ధరకే వాహనాలు కొని స్వల్ప లాభానికే విక్రయిస్తుంటామని చెప్పాడు. అందుకు తగిన ఫొటోలు చూపించాడు. ప్రదోష్ మాటలు నమ్మిన జయసేన్ రూ.6.35 లక్షలు ఇచ్చాడు. కొన్నిరోజుల తర్వాత ప్రదోష్ ఫోన్ స్విచ్ ఆఫ్ ఉంది. అతని నివాసం వద్దకు వెళ్లి చూసేసరికి ఖాళీ చేసి ఉంది. మోసపోయానని తెలిసి పోలీసులను ఆశ్రయించాడు. నిందితుడు గతంలో ఉపయోగించిన ఫోన్ నంబర్లు, సీడీఆర్, ఐఎంఈఐల ద్వారా కొత్త ఫోన్ నంబర్ కనిపెట్టారు. నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ..2 లక్షల నగదు, 7 క్రెడిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.


పోలీసుల అదుపులో నిందితుడు, రికవరీ చేసిన వస్తువులు


సాఫ్ట్‌బాల్ గేమ్ సాధనలో క్రీడాకారులు



ఒకటే గమనం.. గమ్యం

- శ్రీకాకుళంలో ముగిసిన సాఫ్ట్‌బాల్ శిక్షణా శిబిరాలు
- పతకమే లక్ష్యంగా కఠోర సాధన
- హాజరైన 50 మంది అథ్లెట్లు, కోచ్‌లు
- ఈ నెల 22 నుంచి మహారాష్ట్రలో సీనియర్స్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ:

నేషనల్ మీట్‌కు హాజరవుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీనియర్స్ పురుషులు, మహిళల జట్లకు శిక్షణా శిబిరాలు గురువారంతో ముగిశాయి.జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా సాగిన ఈ శిబిరాల్లో రాష్ట్ర జట్లకు ఎంపికైన క్రీడాకారులు పాల్గొని నాలుగు రోజులుగా కఠోర సాధన చేశారు. గేమ్‌లో మెలకువలతోపాటు ఫిట్‌నెస్‌పై తర్ఫీదు పొందారు. జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్లు పతకమే లక్ష్యంగా ఇక్కడ సాధన కొనసాగింది. ఏపీ సాఫ్ట్‌బాల్ పురుషుల జట్టుకు ఎంపికైన ఆరుగురు అంతర్జాతీయ క్రీడాకారులు ఈ శిబిరాల్లో పాల్గొనడం విశేషం. ఆతిథ్య శ్రీకాకుళం జిల్లా నుంచి మొత్తం ముగ్గురు(ఇద్దరు పురుషులు, ఒక మహిళ) క్రీడాకారులు ఏపీ జట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

50 మందితో రెసిడెన్షియల్ క్యాంప్..

ఏపీ రాష్ట్ర జట్లకు ఎంపికైన క్రీడాకారులు, కోచ్‌లతో కలిపి మొత్తం 50 మందితో ఇక్కడ సాఫ్ట్‌బాల్ సంఘం తరపున రెసిడెన్షియల్ కోచింగ్ పొందారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు, కన్వీనర్ వెంకటరామరాజు, ప్రధాన కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మిదేవి, కార్యనిర్వాహక కార్యదర్శి మొజ్జాడ వెంకటరమన పర్యవేక్షించారు. క్రీడాకారులకు సీనియర్ ఏపీ సాఫ్ట్‌బాల్ కోచ్ ఎం.బద్రీనారాయణ(గుంటూరు), కోచ్ కమ్ నేషనల్ రిఫరీ జి.మహేష్ (నెల్లూరు), సీనియర్ ప్లేయర్ కమ్ కోచ్ ఇ.ఉమామహేశ్వరి (కర్నూలు), జిల్లాకు చెందిన పలువురు పీడీలు శిక్షణ అందించారు. మహారాష్ట్రలోని అమరావతి వేదికగా ఈ నెల 22 నుంచి 26 వరకు జరగనున్న 46వ ఆలిండియా సీనియర్ నేషనల్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో వీరంతా ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ మేరకు గురువారం క్రీడాకారులు పయనమయ్యారు.



ఈ ఆరుగురు అంతర్జాతీయ క్రీడాకారులే..

కోచ్ బద్రీనారాయణతో కలిసి కనిపిస్తున్న వీరంతా అంతర్జాతీయ క్రీడాకారులే. పి.జయవర్ధన్ (అనంతపురం), బి.పృథ్వీరాజ్ (అనంతపురం), ఆర్.లోకేష్ (చిత్తూరు), ఎం.బద్రీనారాయణ (కోచ్-గుంటూరు), బి.మహేష్ (అనంతపురం), బి.రాంబాబు (గుంటూరు), పి.గౌతమ్‌రాజ్ (కర్నూలు)జపాన్, నేపాల్, హాంకాంగ్ వేదికగా జరిగిన అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్లలో భారత జట్లకు ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించారు.

సిక్కోలు క్రీడాకారులు..

శ్రీకాకుళం జిల్లా నుంచి ఏపీ సీనియర్స్ జట్టుకు ముగ్గురు ఎంపికయ్యారు. పురుషుల జట్టుకు సిద్దార్థ మహరాణ (మందస), బుడు మూరు రామ్మోహన్ (కేశవరావుపేట గ్రామం- ఎచ్చెర్ల మండలం), మహిళల జట్టుకు గురుగుబెల్లి దుర్గాప్రశాంతి (కేశవరావుపేట) ఎంపికయ్యారు. వీరు ముగ్గురు పలు జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించారు.



వ్యవసాయ కుటుంబం..



మాది వ్యవసాయ కుటుంబం. నారాయణ, అక్కమ్మ మా తల్లిదండ్రులు. డిగ్రీ సెకెండియర్ చదువుతున్నాను. నేను 15నేషనల్స్, 20కి పైగా స్టేట్‌మీట్స్‌లో పాల్గొని అనేక పతకాలు సాధించాను. పీఈటీ కావడమే నా లక్ష్యం.

– తలారి లక్ష్మి, అనంతపురం జిల్లా

ఉద్యోగమే లక్ష్యం..



మాది కృష్ణా జిల్లా విజయవాడ. స్పోర్ట్స్ కోటాను సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యం. శ్రీకాకుళం రావడం ఇదే మొదటిసారి. నేను 2 నేషనల్స్, 6 స్టేట్‌మీట్స్ ఆడాను. ఇంటర్ సెకెండియర్ ఎంపీసీ చదువుతున్నాను.

– లేళ్ళ పూర్ణశ్రీ, విజయవాడ, కృష్ణా జిల్లా

ఆత్మీయత మరువలేం



శ్రీకాకుళం జిల్లాకు పోటీల కోసం, శిక్షణా శిబిరాల కోసం వస్తే మాకు పండగే. మా సొంత జిల్లా కంటే కూడా మమ్మల్ని బాగ చూసుకుటారు. ఆదరిస్తారు. ఈ ఆత్మీయత మరువలేం. రాష్ట్ర పునర్విభజన తర్వాత నా సారధ్యంలో 12 నేషనల్ మీట్స్‌లో పాల్గొన్నాను. ఆరు మెడల్స్ సాధించాం.

– ఎం.బద్రీనారాయణ, గుంటూరు, ఏపీ సాఫ్ట్‌బాల్ సీనియర్ కోచ్

జిల్లాకు గర్వకారణం..



మహారాష్ట్రలో త్వరలో జరిగే సీనియర్ నేషనల్ మీట్‌లో పాల్గొనే ఏపీ జట్లకు శిక్షణా శిబిరాలను నిర్వహించడం గర్వకారణంగా ఉంది. క్రీడాకారులు క్రమశిక్షణగా సాధన చేసి, శిక్షణను సద్వినియోగం చేసుకున్నారు. జిల్లా సంఘ ప్రతినిధులు, పీడీలు ప్రోత్సాహం మరువలేనిది.

– కలిదిండి నరసింహరాజు, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు


వీడ్కోలు కార్యక్రమంలో క్రీడాకారులతో సంఘ నాయకులు కలిదిండి వెంకటరామరాజు, ఎం.వి.రమణ, సూర శ్రీనివాసరావు, పి.సుందరరావు, తిరుపతిరావు, మాధవరావు తదితరులు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు పక్కా ఏర్పాట్లు

మహారాణిపేట : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలని రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఏఆర్వోలను ఆదేశించారు. ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఎన్నిక నిర్వహణలో తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అన్ని శాఖల సమన్వయంతో వ్యవహరించి ఎన్నికను ప్రశాంతంగా జరిగేలా చూడాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, జాబితా రూపకల్పన, బ్యాలెట్ పేపరు తయారీ, గుర్తుల కేటాయింపు తదితర అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. సాంకేతికపరమైన విషయాల్లో ఆచితూచి వ్యవహరించాలన్నారు. పోలింగ్ మెటీరియల్ అందజేత, స్వీకరణ విషయంలో జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. పోలింగ్ ముందు రోజే సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకోవాలని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు తెలపాలని, కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏఆర్వోలు, పోలీసు అధికారులు అక్కడి పరిస్థితులను రిటర్నింగ్ అధికారికి వివరించారు. విశాఖ జిల్లా ఏఆర్వో బిహెచ్.భవానీ శంకర్, అల్లూరి జిల్లా ఏఆర్వో పద్మలత, అనకాపల్లి జిల్లా ఏఆర్వో పీవీఎస్ఎస్ఎన్ సత్యనారాయణ, విజయనగరం జిల్లా ఏఆర్వో శ్రీనివాసమూర్తి, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల ఏఆర్వోలు పాల్గొన్నారు.

హామీలు అమలు కోరుతూ పోస్టుకార్డు ఉద్యమం


పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న ఎస్టీయూ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని.. లేకుంటే ఉద్యమాలు తప్పవని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి అన్నారు. శుక్రవారం నగరంలోని క్రాంతి భవన్‌లో అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అప్పటి ప్రతిపక్షనేతగా చంద్రబాబునాయుడు ఉపాధ్యాయ ఉద్యోగవర్గాలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రికి ఎస్టీయూ సంఘం తరపున పోస్టుకార్డులు పంపే ఉద్యమాన్ని ప్రారంభించారు. వెంటనే పీఆర్సీని అమలుపర్చేలా చర్యలు చేపట్టాలని, ఐఆర్‌ను తక్షణమే ప్రకటించాలని, పెండింగ్ బకాయిలు, పెండింగ్ డీఏలను ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ, శ్రీనివాసరావు, రామారావు, శ్రీధర్, తేజ, లక్ష్మణరావు, వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఫొటోలు తీసి.. మార్ఫింగ్ చేసి

- మార్ఫింగ్ వీడియోలను పోర్న్ సైట్‌లో పెట్టిన యువకుడు
- టెలిగ్రామ్‌లో వీడియోలు పెట్టి డబ్బులు చేసుకున్న మరో యువకుడు
- వివరాలు వెల్లడించిన సీఐ పి.ఈశ్వరరావు



శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో ఒళ్లు గగుర్పాటు కలిగించే విషయాలు వెలుగు చూశాయి. విద్యార్థినితో చనువు పెంచుకున్న ఓ యువకుడు ఆమె ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి ఏకంగా పోర్న్ వెబ్‌సైట్‌లో పెట్టిన అకృత్యాన్ని పోలీసులు పసిగట్టారు. మరొక యువకుడు ఇలాగే మార్ఫింగ్ వీడియోలను టెలిగ్రామ్‌లో షేర్ చేసి సొమ్ము చేసుకుంటున్న వైనాన్ని కూడా పోలీసులు గుర్తించారు. విద్యార్థిని ఈ నెల 11న రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసుల విచారణలో అనేక విషయాలు బయటకు వచ్చాయి. సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం..

విద్యార్థినికి తెలియకుండానే..

చిత్తూరు జిల్లా తిరుపతికి చెందిన షేక్ మహ్మద్ సోయెల్‌కు జిల్లాలో చదువుతున్న విద్యార్థినితో పరిచయం ఉంది. ఆ విద్యార్థినితో చనువుగా ఉంటూ ఆమెకు తెలియకుండానే ఆమె చిత్రాలను, వీడియోలను తీసేవాడు. కొన్నాళ్లకు ఆమె వీడియోలను, ఫొటోలను న్యూడ్‌గా మార్ఫింగ్ చేశాడు. తెలియని నంబర్ నుంచి ఆమె వాట్సాప్‌కు ఫొటోలను, వీడియోలను పంపుతూ లైంగికంగా వేధించడం మొదలుపెట్టాడు.

ధైర్యంగా ఫిర్యాదు చేసి..

ఇలా ఎవరు చేస్తున్నారో తెలియని విద్యార్థిని మొదట్లో తీవ్ర వేదన అనుభవించింది. తల్లిదండ్రులకు, పోలీసులకు చెబితే పరువు పోతుందని మొదట్లో భావించింది. కానీ ధైర్యం చేసి ఈ నెల 11న రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఈశ్వరరావు విచారణ ఆరంభించి పరిచయస్తుల పనే అని భావించి తిరుపతికి చెందిన షేక్ మహ్మద్ సోయెల్ అని తెలుసుకుని నాలుగు రోజుల కిందట తిరుపతిలో ఉంటున్న అతనికి నోటీసులు పంపారు.

మరో దొంగ..

సోయల్‌ను విచారించడం, ఆయన ఫోన్‌ను క్షుణ్ణంగా పరిశీలించడంతో విద్యార్థిని ఫొటోలు, వీడియోలు వెబ్‌పోర్న్ సైట్‌లో అప్‌లోడ్ చేయడం చూశారు. అవే చిత్రాలు, వీడియోలు ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్‌ల్లో సైతం ఎలా అప్‌లోడ్ అయ్యాయన్నది అర్థం కాక జిల్లా సైబర్ సెల్ బృందాన్ని రంగంలోకి దింపారు. వారు ఇన్‌స్టా, టెలిగ్రామ్ యాజమాన్యాలకు మెయిల్‌లో ఫిర్యాదు పంపగా అటునుంచి వారు ఐడీలు, ఫోన్ నంబర్ పంపించారు. అవి కర్నూలు జిల్లా నందికొట్కూరుకు చెందిన ఉప్పుగళ్ల రఘువిగా గుర్తించి అతనికి నోటీసులు పంపారు. గురువారం రఘు స్టేషన్‌కు రాగా విచారించారు.

ఒప్పుకున్నాడు..

పోర్న్‌సైట్‌లో వచ్చిన వీడియోలను అప్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టా, టెలిగ్రామ్‌లలో పెట్టింది తానేనని, ఒకసారి లింక్ చేసే ముందు తనకు రూ. 200లు పంపించాలని చెప్పడంతో చాలామంది తనకు డబ్బు పంపారని రఘు చెప్పారు. విస్తుపోయే నిజాలు తెలియడంతో సీఐ ఈశ్వరరావు గురువారం రాత్రి ఇరువురినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కార్పొరేట్ సంస్థల చొరవ అభినందనీయం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో మౌలిక సదుపాయాల కల్పనకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ముఖ్య ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయంలో వివిధ పరిశ్రమలు, పలు కార్పొరేట్ యాజమాన్య ప్రతినిధులతో జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచినీటి వసతి, సోలార్ లైట్ల ఏర్పాటు, పాఠశాలలు, కళాశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, ప్రభుత్వ ఆస్పత్రిలో మౌలిక సదుపాయాల కల్పన, కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు తోడ్పాటు, పలాసలో డయాలసిస్ యూనిట్ల నిర్వహణ, జిల్లాలో క్రీడా ప్రాంగణాల నిర్మాణం వంటి పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు.

గోవుల వాహనాలు సీజ్


పట్టుబడిన వాహనం

సరుబుజ్జిలి: కబేళాకు మూడు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 28 గోవులను పట్టుకున్నట్లు ఎస్సై బి.హైమావతి తెలిపారు. హిరమండలం నుంచి వాహనాల్లో పశువుల రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో గురువారం సరుబుజ్జిలి జంక్షన్ వద్ద పోలీస్ సిబ్బంది తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. మూడు వాహనాల్లో ఉన్న 8 మందిని విచారణ చేయగా ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతంలో గోవులను కొనుగోలుకు చేసి కబేళాకు తరలించినట్లు నిర్ధారణకు వచ్చామని తెలిపారు. వీరిపై కేసులు నమోదు చేసి వామనాలను సీజ్ చేసి ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. గోవులను విజయనగరం జిల్లా గుర్లంగివలస గోశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా జగన్నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా అదనపు జడ్జి కోర్టు, జిల్లా ఫ్యామిలీ కోర్టు ఇన్ చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా సోంపేట కోర్టు పీపీ దువ్వ జగన్నాయకులు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం జిల్లా కోర్టుకు వచ్చిన ఈయన న్యాయమూర్తులను, బార్ సభ్యులను, ఇప్పటి వరకు పీపీ బాధ్యతలు నిర్వర్తించిన వాన కృష్ణచంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బార్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, జిల్లా బార్ ప్రతినిధులు మరిసర్ల అన్నంనాయుడు, బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, ఎన్.శ్రీరామమూర్తి, బొత్స సుదర్శన్, టి.రామారావు, ఎన్.దుర్గా శ్రీనివాసరావు, జి.వెంకటేష్ పాల్గొన్నారు.

వివాహ వేడుక


బరంపురం గీతాభవన్‌లో వివాహ వేడుక

పర్లాకిమిడి: 'కహానా' చారిటబుల్ ట్రస్టు (బరంపురం) 5వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గీతాభవన్‌లో గురువారం పేద వధూవరులకు సామూహిక వివాహ వేడుకను నిర్వహించారు. గంజాం జిల్లాలో ఆర్థికంగా వెనుకబడిన ఎనిమిది జంటలను ఎంపిక చేసి వారి కుటుంబ సభ్యుల కోరిక మేరకు బరంపురం గీతా భవన్‌లో ఈ వివాహ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకకు ముఖ్యఅతిథిగా అరూత్, ట్రస్టు అధ్యక్షుడు రంజనా మిశ్రా విచ్చేశారు. నూతన వధూవరూల తరపున పెద్ద సంఖ్యలో బంధువులు హాజరయ్యారు. సంప్రదాయ సిద్ధంగా కానుకలు చదివించారు. నూతన వధూవరులకు హిందూ సంప్రదాయం ప్రకారం బహుమతులు, గృహోపకరణాలను ట్రస్టు సభ్యులు అందజేశారు.

చోరీ కేసులో నగలు రికవరీ

ఎల్.ఎన్.పేట: మండలంలోని చిట్టిమండలం కాలనీలో నివాసముంటున్న ఎ.లక్ష్మి ఇంట్లో చోరీ ఘటనకు సంబంధించి నాలుగు తులాల బంగారు నగలు రికవరీ చేసి బాధితురాలికి అప్పగించామని సరుబుజ్జిలి ఎస్సై బి.హైమావతి గురువారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన మరో మహిళ దొంగతనం చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. నగలు రికవరీ చేసి బాధితురాలికి అప్పగించామని తెలిపారు.

అర్ధశతాబ్దపు అద్భుతం



కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ముఖద్వారం


ఎద్దు గోపాలదాసునాయుడు, మొదటి ప్రిన్సిపాల్

కొత్తూరు: కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ యాభై ఏళ్లు పూర్తి చేసుకుంది. కాలేజీ గోల్డెన్ జూబ్లీని శుక్రవారం నిర్వహించేందుకు సిబ్బంది సర్వం సిద్ధం చేశారు. 1974లో కాలేజీ ఏర్పాటైంది. కాలేజీ మొదటి ప్రిన్సిపాల్ ఎద్దు గోపాలదాసు నాయుడు. ప్రస్తుతం కాలేజీలో 300 మంది వరకు చదువుతున్నారు. ఇంటర్మీడియెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన ఘనతను ఈ కాలేజీ సొంతం చేసుకుంది. ఇక్కడ చదువుకున్న వారు ఎంతో మంది ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. కొత్తూరులో కాలేజీ ఏర్పాటు కోసం స్థానిక నాయకుడు లోతుగెడ్డ చంద్రయ్యనాయుడు, మాజీ మంత్రి గొర్లె శ్రీరాములు నాయుడు కృషి చేశారు. 1972 ఏడాది నుంచి కాలేజీ కోసం ప్రయత్నాలు చేయగా 1974లో ఏర్పాటైంది. మొదట ఉన్నత పాఠశాల గదుల్లో తరగతులు ప్రారంభించారు. కొత్తూరు, భామిని, హిరమండలం, సీతంపేట, ముమ్మలక్ష్మీపురంతో పాటు పలు ప్రాంతాలకు ఈ కాలేజీ ఎంతో కీలకంగా నిలిచింది.

క్లుప్తంగా

జోరుగా నకిలీ స్టాంపుల విక్రయాలు



వీరఘట్టంలో విక్రయిస్తున్న నకిలీ రూ.10 స్టాంప్ పేపర్

వీరఘట్టం: వీరఘట్టంలో కొంతమంది వ్యక్తులు నకిలీ స్టాంపుల విక్రయాలకు పాల్పడుతున్నారు. గతంలో రిజిస్ట్రార్ ఆఫీసుల్లో కొనుగోలు చేసిన రూ.10, రూ.50 స్టాంపు పేపర్లను పోలిన మాదిరిగానే కలర్ జిరాక్స్‌లు తీసి అడ్డుగోలు వ్యాపారానికి తెరతీశారు. భూముల కొనుగోళ్లు, ఇతర లావాదేవీల కోసం ఈ స్టాంపు పేపర్లు అవసరమైన వారు అవి నకిలీ అని తెలియక కొనుగోలు చేస్తున్నారు.ఈ నకిలీ స్టాంపుల వ్యవహారంపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి ఇటువంటి మోసాలకు పాల్పడుతున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పూరిల్లు దగ్ధం



కాలిపోయిన పూరిల్లు

దత్తిరాజేరు: మండలంలోని టి.బూర్జవలసలో చింతగడ ప్రసాద్‌కు చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైనట్లు సర్పంచ్ మంత్రి క్రాంతికుమార్, ఎంపీటీసీ మంత్రి అప్పలనాయుడు గురువారం తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో సకాలంలో వచ్చి మంటలు చుట్టుపక్కల ఇళ్లకు వ్యాపించకుండా అదుపు చేశారని చెప్పారు. నిరుపేద అయిన ప్రసాద్‌కు చెందిన ధాన్యం, బియ్యం, పప్పు దినుసులు టీవీ ఇతర ఇంటి సామగ్రి బట్టలు, ఈ ప్రమాదంలో కాలి బూడిదవడంతో కటుంబసభ్యులు రోడ్డున పడ్డారని ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

మాజీ ఎంపీటీసీకి తీవ్రగాయాలు

రామభద్రపురం: మండలంలోని దుప్పలపూడి గ్రామం సమీపంలో గురువారం బైక్‌పై వెళ్తున్న మాజీ ఎంపీటీసీని ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీ కొనడంతో మాజీ ఎంపీటీసీకి తీవ్ర గాయాలయ్యాయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాతరేగ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పెద్దింటి పైడిపునాయుడు తన అత్తయ్య ఆరోగ్యం బాగులేకపోవడంతో బొబ్బిలి తీసుకెళ్లాడు.అక్కడ వైద్యాధికారికి చూపించి తిరిగి సొంత గ్రామానికి తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో సరిగ్గా దుప్పలపూడి జంక్షన్‌కు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న మరో బైక్ బలంగా ఢీ కొట్టి తప్పించుకుని పరారయ్యాడు. వెంటనే స్థానికులు పైడిపునాయుడిని ప్రథమచికిత్స నిమిత్తం స్థానిక ఎస్‌ఆర్‌ఐ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై క్షతగాత్రుడి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు స్పందించిన ఎస్సై వి.ప్రసాదరావు ఎస్‌ఆర్‌ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని పరామర్శించి వివరాలు సేకరించారు.ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించిన అనంతరం కొత్తరేగలో వివాహం జరుగుతోందని తెలుసుకుని అక్కడికి వెళ్లి దర్యాప్తు చేస్తుండగా ఢీ కొట్టింది తానేనని అదే గ్రామానికి చెందిన చొక్కాపు గౌరీశ్వరరావు ఎస్సై ముందు అంగీకరించాడు. దీంతో ఎస్సై కేసు నమోదు చేశారు.

ఎన్‌డీఏ, ఐఎన్‌ఏకు సైనిక పాఠశాల విద్యార్థుల అర్హత



కోరుకొండ సైనిక పాఠశాల

విజయనగరం రూరల్: యూపీఎస్సీ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ), ఇండియా నేవల్ అకాడమీల్లో (ఐఎన్‌ఏ) ప్రవేశాలకు కోరుకొండ సైనిక పాఠశాల విద్యార్థులు 8 మంది అర్హత సాధించారని కోరుకొండ సైనిక పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న 33 సైనిక పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్ష రాయగా కోరుకొండ పాఠశాలకు చెందిన 8 మంది ఈ ఏడాది ఎన్‌డీఏ, ఐఎన్‌ఏకు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. ఎన్‌డీఏ, ఐఎన్‌ఏల్లో ప్రవేశాలే లక్ష్యంగా అందిస్తున్న శిక్షణ, కార్యకలాపాలే ఈ విజయానికి కారణమన్నారు. ఇంతటి విజయానికి కారకులైన పాఠశాల అధికారులు, ఉపాధ్యాయ సిబ్బంది అంకితభావాన్ని ఆయన ప్రశంసించారు.

విందులో విష సంస్కృతి

- విచ్చలవిడిగా ప్లాస్టిక్ బఫే ప్లేట్ల వినియోగం
- పుట్టగొడుగుల్లా పరిశ్రమల ఏర్పాటు
- కలుషితమవుతున్న ఆహారపదార్థాలు
- ప్రమాదకరంగా పరిశ్రమల పరిసర ప్రాంతాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- వాటర్ ప్లాంట్లుల్లోనూ అదే పరిస్థితి



సంవత్సరాలు గడిచినా భూమిలో కలవని ప్లాస్టిక్ ప్లేట్లు



రాజాంలో ఓ ఫ్యాక్టరీలో ప్లాస్టిక్ ప్లేట్ల తయారీ



ఇలా మిగిలిన వ్యర్థాలతో పర్యావరణ కాలుష్యం



రాజాం మండలం అంతకాపల్లి సమీపంలో వాటర్ ప్లాంట్ వద్ద ప్రమాదకరంగా ప్లాస్టిక్ వ్యర్థాలు

రాజాం: పట్టణాలు, గ్రామాల్లో నిర్వహిస్తున్న విందు భోజనాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. శుభకార్యక్రమాలు, పెళ్లిళ్లు, పూజలు, పేరంటాళ్ల పండగ వంటి కార్యక్రమాల్లో నిర్వహించే సామూహిక భోజన కార్యక్రమాల్లో కొత్త సంస్కృతి ప్రారంభమైంది. గతంలో ఈ భోజనాల్లో అరటి ఆకులు, అడ్డాకులు(విస్తర్లు) వినియోగించేవారు. ఇప్పుడు ప్లాస్టిక్ బఫే పేట్లు వినియోగంలోకి వచ్చాయి. వాటిని పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ఫలితంగా వాటిలో భోజనాలు చేసే వ్యక్తులు క్యాన్సర్ వంటి భయానక రోగాలబారిన పడుతూ ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. వాటితో పాటు ఆయా కార్యక్రమాల వద్ద వినియోగిస్తున్న వాటర్ ప్యాకెట్లు కూడా ప్రమాదకర వ్యాధులను ప్రజలకు అంటగడుతున్నాయి. ఆయా ఫ్యాక్టరీల వద్ద ప్లాస్టిక్ కవర్లు పోగులుగా ఏర్పడి, పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయి.

అంతా కలుషితమే

ఇప్పుడు ప్రతి గల్లీలో పేపర్ ప్లేట్ల పరిశ్రమలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వాటికోసం వినియోగిస్తున్న ముడిసరుకు చాలా ప్రమాదకరంగా ఉంది. వాటితయారీ అనంతరం వచ్చిన వ్యర్థాలు ఆయా పరిశ్రమల పక్కన పొలాల్లో, చెరువుల్లో పడేయడంతో ఆయా ప్రాంతాలు కలుషితమవుతున్నాయి. వాటిని అన్నసంతర్పణలు, భోజనాల్లో వినియోగించిన తరువాత ప్లేట్లను ప్రధాన రహదారులు, చెరువుల పక్కన వదిలేయడంతో ఆయా ప్రాంతాలు ప్రమాదకర రసాయనాలతో కలుషితంగా మారుతున్నాయి. మానవుని ఆరోగ్యంతో పాటు ఆయా ప్రాంతాల్లో ఈ మిగిలిన ఆహార పదార్థాలు తినడం ద్వారా పశువులు సైతం రోగాల బారిన పడుతున్నాయి. అలాగే ఆయా కార్యక్రమాల వద్ద వాటర్ ప్యాకెట్లు, బాటిల్స్ వినియోగం ప్రమాదరంగా మారుతోంది. అవి ఏళ్ల తరబడి భూమిలో కలవడంలేదు. వాటిని పడేస్తున్న పంటపొలాలు, చెరువులు ప్రమాదకరంగా మారుతున్నాయి. వాటిని నియంత్రించాల్సిన అధికారులు సైతం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో పర్యావరణం కలుషితమై చాపకింద నీరులా విస్తరిస్తోంది.

ప్రమాదకర రసాయనాలు

పేపర్ ప్లేట్లు, కప్పుల్లో ప్రమాదకర రసాయనాలు ఉంటున్నాయి. హైడ్రోఫోబిక్ ఫిల్మ్ పొరను వాటి తయారీలో వినియోగిస్తున్నారు. మెట్రో సోమిన్, బిస్ఫినాల్, బార్డ్ ఇథనాల్ డాక్సిన్ వంటి కెమికల్స్ ఈ ప్లేట్లు, కప్పుల్లో ఉంటున్నాయి. వాటిలో వేడి వేడి ఆహార పదార్థాలు వేసిన వెంటనే కరిగి ఆయా ఆహార పదార్థాల ద్వారా మానవ శరీరంలోకి చేరుతాయి. దీంతో చర్మసంబంధిత వ్యాధులతో పాటు ప్రమాదకర క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన ప్రజలు పడుతున్నారు.

చర్యలు లేవు

ప్లాస్టిక్ వినియోగం ఏదో ఒక రూపంలో ప్రజలను వెంటాడుతోంది. పర్యావరణాన్ని కలుషితం చేస్తోంది. ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా దారి మళ్లించి ప్లాస్టిక్ భూతం ప్రజల మధ్యకు వస్తోంది. అధికారులు ప్లాస్టిక్ నిషేధంపై క్షేత్రస్థాయిలో బాధ్యత వహించాలి, ప్రతి ఒక్క ఉద్యోగికి ప్లాస్టిక్ నిషేధంలో భాగస్వామ్యం కల్పించాలి.

ఆర్‌వీజే నాయుడు,
రాజాం పర్యావరణ పరిరక్షణ కమిటీ కన్వీనర్,

చర్యలు తీసుకుంటున్నాం

రాజాం పట్టణంలో ప్లాస్టిక్ నిషేధంపై పూర్తిస్థాయిలో దృష్టిసారించాం. తొలుత షాపుల్లో ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించే కార్యక్రమం చేస్తున్నాం. ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పుల తయారీ పరిశ్రమలపై దృష్టిసారిస్తాం. వాటితో పాటు వాటర్ ప్లాంట్ల వద్ద కూడా ప్లాస్టిక్ వినియోగాన్ని నివారిస్తాం. ప్లాస్టిక్ వ్యర్థాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఆయా ప్రాంతాల్లోని సచివాలయాల్లో ఫిర్యాదుచేయాలి.

సీహెచ్. ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, రాజాం

చికెన్ వినియోగంపై అపోహలు వద్దు

- జిల్లాలో బర్డ్ ఫ్లూ వ్యాధి లక్షణాలు లేవు
- హెూటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

విజయనగరం: జిల్లాలో బర్డ్ ఫ్లూ వ్యాధి లక్షణాలు లేనని, చికెన్ వినియోగంపై ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవద్దని జిల్లా హోటల్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది. ఈ మేరకు గురువారం నగరంలోని మయూర హోటల్‌లో జిల్లా హోటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నాగుల్ మీరా పాల్గొని ప్రజలలో ఉన్న అపోహలను తొలగించేందుకు మీడియా సహకారం కావాలని కోరారు. కేవలం రాష్ట్రంలోని రెండు మూడు జిల్లాల్లో మాత్రమే బర్డ్‌ఫ్లూలక్షణాలు కనిపించాయని, విజయనగరం జిల్లాలో ఎటువంటి లక్షణాలు లేవన్నారు. హోటల్స్ పరంగా తాము నిత్యం దాడులు నిర్వహిస్తున్నామని, ఎవరైనా కల్తీ చేసినట్లు నిరూపితమైతే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. హోటల్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ పుకార్లు రావడంతో హోటల్స్ వ్యాపారాలు ఒక్కసారిగా పడిపోయాయన్నారు. ప్రజలు చికెన్ వినియోగించవచ్చన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నవీన్, శ్రీనివాసరావు, కాళ్ల సునీల్, మహమ్మద్ అకితుల్లా, రోహిత్, ఈశ్వర్, పతన్, చందు తదితరులు పాల్గొన్నారు.

లలిత క్రీడా వైభవం

- పారా జాతీయస్థాయి పోటీల్లో స్వర్ణపతకం



గోల్డ్‌మెడల్ సాధించిన కిల్లక లలిత

విజయనగరం: చెన్నైలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం వేదికగా ఈ నెల 17 నుంచి వరకు జరిగిన 23వ పారా జాతీయస్థాయి చాంపియన్‌షిప్ క్రీడా పోటీల్లో జిల్లాకు స్వర్ణపతకం దక్కిందని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కె.దయానంద్ తెలిపారు. పోటీల్లో పాల్గొన్న జిల్లాకు చెందిన కిల్లక లలిత 400 మీటర్ల పరుగు పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి గోల్డ్ మెడల్ సాధించిందని తెలిపారు. గతం లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక మెడల్స్ సాధించిన లలిత చెన్నైలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించడంతో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించినట్లు చెప్పారు. ఈ విజయం క్రీడల్లో జిల్లా ప్రతిష్టను మరింత పెంచిందని, భవిష్యత్‌లో ఆమె మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. పారా జాతీయ పోటీల్లో పతకం సాధించిన లలితతో పాటు కోచ్ తబరీష్‌లను కలెక్టర్ డాక్టర్.బీఆర్.అంబేడ్కర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు, కార్యదర్శి వి.రామస్వామిలు అభినందనలు తెలియజేశారు.

రాష్ట్రస్థాయి వెటరన్ షటిల్ పోటీలకు పయనం



రాష్ట్రస్థాయి పోటీలకు పయనమైన జిల్లా బ్యాడ్మింటన్ క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న వెటరన్స్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా జట్టు గురువారం పయనమైంది. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు విజయవాడలో జరగనున్న పోటీలకు ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి మొత్తం 30 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించనున్నారు. జిల్లా జట్టుకు కోచ్ అండ్ మేనేజర్‌లుగా వై.కుసుం బచ్చన్, నున్న సురేష్‌లు వ్యవహరించనున్నారు. ఈ బృందంలో జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించిన తొమ్మిది మంది క్రీడాకారులు కుసుం బచ్చన్, టీఎల్.సుబ్బారావు, మల్లికార్జునరావు అపర్ణ బాబా, గణేష్, నవీన్‌కుమార్, ఖలీలుల్లా, ఎం. శ్రీను, పైడిరాజు పాల్గొననున్నారు. ఈ బృందానికి జిల్లా గుర్తింపుతో టీ షర్ట్స్‌ను జిల్లా సంఘం చైర్మన్ ఇందుకూరి రఘురాజు బహూకరించగా, జిల్లా బాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు కేపీ నాయుడు జిల్లా సంఘం ద్వారా క్రీడాకారులకు ప్రవేశరుసుము, రిజిస్ట్రేషన్ రుసుము చెల్లిస్తున్నారు. జిల్లా జట్టుకు అసోసియేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపి రాష్ట్రస్థాయి పోటీల్లో విజయనగరం జిల్లా పేరు ప్రఖ్యాతులు చాటి చెప్పాలని ఆకాంక్షించారు.

27న జీఎంఆర్ నైరెడ్‌లో ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ నైరెడ్‌లో ఈ నెల 27న ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని డైరెక్టర్ ఎం.రాజేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసుగల నిరుద్యోగ స్త్రీ, పురుషులు అర్హులన్నారు. పురుషులకు రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషన్ (75 రోజులు), సెల్‌ఫోన్ రిపేరింగ్ అండ్ సర్వీసింగ్ (30 రోజులు), జెంట్స్ టైలరింగ్ (30 రోజులు), సీసీ టీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్ (13 రోజులు), అలాగే స్త్రీలకు లేడీస్ టైలరింగ్ (30 రోజులు), కంప్యూటర్ ట్యాలీ అండ్ బేసిక్స్ (30 రోజులు), మగ్గం వర్క్స్ (30 రోజుల పాటు)లో శిక్షణ ఉంటుందన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యేవారు పదో తరగతి మార్కుల లిస్టు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డులతో పాల్గొనాలని సూచించారు. జెంట్స్ టైలరింగ్, లేడీస్ టైలరింగ్, మగ్గం వర్క్స్‌కు హాజరయ్యేవారికి 5వ తరగతి విద్యార్హత ఉంటే చాలని తెలిపారు. శిక్షణ కాలంలో భోజన, వసతి సదుపాయం కల్పించనున్నామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9014716255, 9491741129 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మహాశివరాత్రికి రామతీర్థంలో గట్టి పోలీస్ బందోబస్తు

- సీఐ రామకృష్ణ



దేవస్థానం సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లపై చర్చిస్తున్న సీఐ రామకృష్ణ

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో ఈ నెల 26 నుంచి జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని సీఐ జి.రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు రామతీర్థంలో బందోబస్తు ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా క్యూల నిర్వహణ, పార్కింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, తదితర అంశాలపై దేవస్థానం సిబ్బందితో చర్చించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ..రెండు రోజుల పాటు జరిగే శివరాత్రి ఉత్సవాలకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా విచ్చేసే అవకాశం ఉందన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. స్థానిక వ్యాపారులు భక్తులకు ఇబ్బందులు కలిగించకుండా తమ వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. శ్రీకాకుళం నుంచి వచ్చే భక్తులకు దన్నానపేట జంక్షన్ వద్ద, విజయనగరం వైపు నుంచి వచ్చే భక్తులకు సీతారామునిపేట జంక్షన్ వద్ద పార్కింగ్ కేంద్రాలను అందుబాటులో ఉంచామన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో జాతరలో నిరంతర నిఘా ఉంటుందని, డ్రోన్స్‌ను వినియోగించి గస్తీ నిర్వహిస్తామన్నారు. ఆకతాయల కదలికలపై నిఘా పెడతామని, అల్లర్లకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతర విజయవంతానికి భక్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై గణేష్, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయసంఘాల మద్దతుతో స్వతంత్రంగా పోటీ

- ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు



మెరకముడిదాం జెడ్పీపాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు

మెరకముడిదాం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తాను పార్టీల కతీతంగా స్వతంత్రంగా, కేవలం ఉపాధ్యాయ సంఘాల తరఫున పోటీ చేస్తున్నానని గాదెశ్రీనివాసులునాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మెరకముడిదాం మండలంలోని భైరిపురం, గర్భాం, మెరకముడిదాం, ఉత్తరావల్లి, గరుగుబిల్లి, సాతాంవలస జెడ్పీపాఠశాలలతో పాటు మెరకముడిదాం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, గర్భాం ఏపీ మోడల్‌స్కూల్‌లో పర్యటించి ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. తనను గెలిపించి నట్లయితే చాలాకాలంగా పరిష్కారం కాకుండా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాను నిరంతరం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికే పనిచేస్తానని, ఏ పార్టీ అధికారంలో ఉన్నా పార్టీల జోలికి వెళ్లకుండా కేవలం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. అలాగే మహిళలకు అవసరమైన మరిన్ని సెలవులను తెచ్చేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును తనను వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆల్తిరాంబాబు, జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు, మండలానికి చెందిన పలు యూనియన్ల నాయకులు ఆర్.సింహాద్రి, టీవీవీఎల్.నరసింహులు, కృష్ణ, సత్తారు రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎంటీఎస్ ఇప్పించండి

కాగా మెరకముడిదాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాదెశ్రీ నివాసులనాయుడిని మెరకముడిదాం మండలానికి చెందిన ఎస్ఎస్ఏ ఉద్యోగులు (పార్ట్‌టైమ్ ఉద్యోగులు, సీఆర్‌ఎంటీలు, ఎంఈఓ కార్యాలయం సిబ్బంది) కలిసి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన తరువాత తమకు ఎంటీఎస్ ఇప్పించాలని, అలాగే తమను పార్ట్‌టైమ్ ఉద్యోగులుగా కాకుండా ఒకేషనల్ ఉపాధ్యాయులుగా ప్రభుత్వం పరిగణించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన గాదె శ్రీనివాసులునాయుడు తాను గెలుపొందిన వెంటనే ఎస్ఎస్ఏ ఉద్యోగులందరికీ ఎంటీఎస్ వర్తించేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, శంకర్రావు, సత్యవతి, ఉగాది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు శశికుమార్



శశికుమార్

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న కబడ్డీ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారుడు అర్హత సాధించాడు. ఈనెల 20 నుంచి 23 వరకు కటక్‌లో జరగనున్న సీనియర్ పురుషుల కబడ్డీ పోటీలకు విజయనగరం జిల్లాకు చెందిన శశికుమార్ ఎంపికయ్యాడు. ఈ క్రీడాకారుడు గత నెలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో జరగనున్న పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. శశికుమార్ ఎంపిక పట్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ఐవీపీ రాజు, అధ్యక్షుడు రంగారావు, కార్యదర్శి కేవీ ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మణరావు, ట్రెజరర్ శివకుమార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చర్యలు

- ఎస్పీ మాధవ్ రెడ్డి



పార్వతీపురం రూరల్: సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర, అనైతిక, విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్, ఎక్స్(ట్విట్టర్) ఇతర సోషల్ మీడియాలో ఇతరులను కించపరిచేలా పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. ప్రముఖ వ్యక్తులు, మహిళలు, పిల్లలు, సంస్థలపై హేయమైన, జుగుప్సాకరమైన పదజాలంతో, మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు రోలింగ్ చేసినా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. తప్పుదారి పట్టించే ఫేక్ న్యూస్ పెట్టిన, షేర్‌చేసేవారిపై, సంబంధిత గ్రూప్ అడ్మిన్లపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా యువత అనవసర పోస్టులు పెట్టి భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని హితవు పలికారు.

నాటిక పోటీలు ప్రారంభం

నెల్లిమర్ల: జరజాపుపేట నల్లి సూరిబాబు స్మారక కళాప్రాంగణంలో ఆరిపాక బ్రహ్మానందం స్మారక నాటక పరిషత్ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రదర్శించిన రైతే రాజు, ఎడారిలో వాన చినుకు నాటికలు ఆహూతులను ఆలోచింపజేశాయి. ప్రారంభోత్సవంలో పాల్గొన్న కూటమి నాయకులు చనమల్లు వెంకటరమణ, సువ్వాడ రవిశేఖర్ మాట్లాడుతూ రంగస్థల నటుడు ఆరిపాక బ్రహ్మానందం కళారంగానికి చేసిన సేవలు మరువలేనివన్నారు.కళలకు కాణాచి అయిన జరజాపుపేటలో నాటక పరిషత్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఆరిపాక శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాకారులు ఈపు విజయ్ కుమార్, అవనాపు సత్యనారాయణ, లెంక అప్పలనాయుడు, ఆరిపాక రాము, తదితరులు పాల్గొన్నారు.

అనుమానంతోనే భార్య హత్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బొబ్బిలి డీఎస్పీ జి.భవ్య

దత్తిరాజేరు: ఈనెల 6న గుచ్చిమి గ్రామ సమీపంలో ఉన్న పామాయిల్ తోటలో భార్య యాకల గౌరమ్మను అనుమానంతోనే భర్త సత్యం హతమార్చాడని బొబ్బిలి డీఎస్పీ జి.భవ్య తెలిపారు. నిందితుడు పెదమానాపురం బీసీ కాలనీ వద్ద ఉన్నట్లు సమాచారం రావడంతో ఎస్సై జయంతి, సీఐ రమణ పట్టుకున్నారు. ఈ మేరకు గురువారం సాయంత్రం పెదమానాపురం పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ భవ్య వివరాలు వెల్ల డించారు. స్వగ్రామం చుక్కపేట నుంచి పొలం పనులకు వెళ్తుండగా తోట వద్ద కొడవలితో హత్య చేసి అక్కడి నుంచి చెరువులో సెల్‌ఫోన్ పడేసి రక్తపు మరకలు కడుక్కుని మరడాం, మేడపల్లి, పోరాం, ఉద్దంగి వద్ద జాతీయ రహదారి దగ్గరలో నిందితుడు వేసుకున్న షర్ట్‌ను విప్పేసి తువ్వాలు కప్పుకుని బొండపల్లి మండలం గొల్లుపాలెంలో ఐదు రోజుల పాటు గొర్రెల కాపరులతో ఉన్నాడు. వారు డబ్బులు ఇవ్వకపోవడంతో పెందుర్తిలో కొత్తగా నిర్మిస్తున్న ఇంటి పని చేయగా కూలి రూ.2వేలు రావడంతో ఆ డబ్బులతో బుధవారం సాయంత్రం పెదమానాపురం వచ్చాడు. భార్య మృతి చెందిందా? లేదా? పిల్లలు ఎలా ఉన్నారో? ఊరి పరిస్థితి తెలుసుకోవడానికి నిందితుడు పెదమానాపురం వచ్చిన సమాచారంతో పోలీసులకు పట్టుబడడంతో అరెస్ట్ చేశామని తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో సంస్థాగత నియామకాలు

విజయనగరం: రాష్ట్రంలో బాధ్యతగల ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న వైఎస్సార్‌సీపీ పార్టీ బలోపేతం దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పార్టీలో నూతన నియామకాలు చేపడుతూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటన విడుదల చేసింది. నూతనంగా నియామకమైన నాయకులు రానున్న నాలుగు సంవత్సరాల పాటు పార్టీ బలోపేతంతో పాటు ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక పాలనపై పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.

నూతన నియామకాలు ఇవే..

నూతన నియామకాల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజాంకు చెందిన టంకాల అచ్చంనాయుడు, బొబ్బిలి నుంచి చొక్కాపు లక్ష్మణరావు, నెల్లిమర్ల నుంచి పతివాడ అప్పలనాయుడు, విజయనగరం జిల్లా కేంద్రం నుంచి సీనియర్ కార్పొరేటర్ శెట్టి వీర వెంకట రాజేశ్వరరావు, గజపతినగరం నుంచి పొంద్రంకి సంజీవరావు, చీపురుపల్లి నుంచి శిరవూరు వెంకటరమణరాజు, ఎస్ కోట నుంచి నూకల కస్తూరి నియామకమయ్యారు. జిల్లా పార్టీ కోశాధికారిగా రాజాం నియోజకవర్గానికి చెందిన సిరిపురపు. జగన్ మోహన్ రావు బాధ్యతలు స్వీకరించనున్నారు. అదే విధంగా జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శులుగా గజపతినగరం నుంచి వర్రి నరసింహమూర్తి, నెల్లిమర్లకు చెందిన అల్లాడ సత్యనారాయణమూర్తి, చీపురుపల్లి నుంచి ఇప్పిలి అనంత్ , విజయనగరం నుంచి సంగంరెడ్డి.బంగారు నాయుడు, బొబ్బిలి నుంచి తమ్మిరెడ్డి దామోదర్ రావులు నియమితులయ్యారు. అదే విధంగా పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా విజయనగరం నుంచి బొద్దాన అప్పారావు, కిలారి రాంబాబు, గజపతినగరం నుంచి తొత్తడి సత్తిబాబు, సుంకరి రామునాయుడు, బొబ్బిలి నుంచి చెలికాని.మురళీకృష్ణ, ఆవు సత్యనారాయణ, రాజాం నుంచి కనకాల సన్యాసినాయుడు, కిమిడి ఉమామహేశ్వరరావులను నియమించారు. ఎస్.కోట నుంచి పినిశెట్టి వెంకటరమణ, పినిశెట్టి కష్టప్ప దొర, చీపురుపల్లి నుంచి శీర.అప్పలనాయుడు, నెల్లిమర్ల నుంచి లంక లక్ష్మణరావు, కర్రోతు వెంకటరమణలు నూతన కమిటీలో స్థానం దక్కించుకున్నారు. జిల్లా కార్యదర్శులుగా విజయనగరానికి చెందిన దుప్పాడ సునీత, కునుకు నాగరాజు, గజపతినగరం నుంచి బందారు బంగారమ్మ, సుమల గోవింద, బొబ్బిలి నుంచి సీహెచ్ సత్యనారాయణ, భమిడిపాటి విశ్వనాథశర్మ, రాజాం నుంచి ఎస్.రమేష్ నాయుడు, గడి మధుసూదనరావు, ఎస్.కోట నుంచి ఎం.అప్పారావు, పల్లా భీష్మా, చీపురుపల్లి నుంచి కొణిశి కృష్ణంనాయుడు, కరిమజ్జి శ్రీనివాసనాయుడు, నెల్లిమర్ల నుంచి బుగత రమణ, జి.మురళీమోహనరావులు నియామకమయ్యారు. అదేవిధంగా పార్టీ స్పోక్స్ పర్సన్‌గా రాజాం నుంచి ఉత్తరావల్లి సురేష్‌ముఖర్జీ, బొబ్బిలి నుంచి బి.సత్యనారాయణ, చీపురుపల్లి నుంచి రేగిడి లక్ష్మణరావు, గజపతినగరం నుంచి కరణం ఆదినారాయణ, నెల్లిమర్ల నుంచి సముద్రపు రామారావు, విజయనగరం నుంచి కనకల రఘురామారావు, ఎస్.కోట నుంచి గొర్లె రవికుమార్‌లు నియమితులయ్యారు.

గంజాయి అక్రమ రవాణా నిందితుడి అరెస్టు



అరెస్టు చేసిన నిందితుడితో సీఐ

రామభద్రపురం: 2019లో ఐషర్ వ్యాన్‌లో గంజాయి అక్రమ రవాణా చేస్తూ పరారైన నిందితుడు డ్రైవర్ కిల్లో చిరంజీవి స్థానిక బైపాస్ రోడ్డులో పోలీసులకు గురువారం పట్టుబడ్డాడు. ఈ మేరకు సీఐ కె.నారాయణరావు, ఎస్సై వి.ప్రసాదరావు నిందితుడిని అదుపులోకి తీసుకుని అరెస్టుచేశారు. ఈ సందర్భంగా సీఐ విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొట్టక్కి పెట్రోల్ బంకు సమీపంలో కాకర్లవలస జంక్షన్ వద్ద సాలూరు మీదుగా రామభద్రపురం వైపు వస్తున్న గంజాయితో ఉన్న వ్యాన్ 2019 జూన్ 17వ తేదీన స్థానిక పోలీసులకు పట్టుబడింది. అప్పట్లో అల్లూరు సీతారామరాజు జిల్లా పెదబూరుగు మండలం తామర వీధి గ్రామం నుంచి 266 కిలోల గంజాయిని ఐషర్ వ్యాన్‌తో అక్రమంగా తరలిస్తుండగా కొట్టక్కి పెట్రోల్ బంకు సమీపంలో ఎస్సై బి.లక్ష్మణరావు, సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. పట్టుబడిన వ్యాన్‌ను స్వాధీనం చేసుకోగా డ్రైవర్ కిల్లో చిరంజీవి పరారవడంతో క్లీనర్ వెల్లంగి రమేష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని కేసునమోదు చేశారు. ఇన్నాళ్ల తరువాత స్థానిక బైపాస్ రోడ్డులో అప్పటి నిందితుడు సంచరిస్తున్నాడన్న సమాచారం మేరకు గురువారం పోలీసులు చిరంజీవిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు.